ప్రజాశక్తి
సోమవారం 15 డిసెంబర్ 2025







అనంతపురంలో ఐలు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు హాజరైన ప్రముఖులు

సదస్సులో ప్రసంగిస్తున్న రిటైర్డ్ జడ్జి కె.చంద్రు

బతుకు బొగ్గుపాలు..!



- వలస కూలీల అవస్థలు
- జనావాసాలకు దూరంగా నివాసం
- పాత సిమెంట్ సంచులే నివాసాలు
- ఏడాది పొడవునా బొగ్గులు కాలుస్తూ జీవనం
- మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కుటుంబాలు
- చదువులకు పిల్లలు దూరం

ఉన్న ఊరిలో పని దొరక్క.. దొరికిన చిన్నపాటి పనితో కుటుంబాన్ని పోషించుకోలేక బతుకుదెరువు కోసం కూలీలు వలస బాటపడుతున్నారు. గ్రామాల నుంచి మొదలైన వలస రాష్ట్రాలను దాటుతోంది. వేల కిలోమీటర్లు దాటి వస్తున్నారు. ఇలా బొగ్గులు కాల్చే కూలీలు మహారాష్ట్ర నుంచి పెనుకొండ ప్రాంతానికి వలసొచ్చారు. వీరికి తాగటానికి నీళ్లు లేక.. ఉండటానికి నీడలేక.. కారుచీకట్లలో చిన్న దీపం వెలుగులో చిట్టడవిలో నివాసాలుగా చేసుకుని బొగ్గులు కాలుస్తూ జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ

మహారాష్ట్రలోని మన్వాత్ తాలూకా ఇందాపూర్ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు పెనుకొండ సమీపంలో పెద్ద చెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయం ఎదురు 44వ జాతీయ రహదారి పక్కన సీమజాలి చెట్లను కాల్చి బొగ్గులు తయారు చేస్తున్నారు. వీరంతా అక్కడే పాత సిమెంటు సంచులతో చిన్న గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. వీరు ఉన్న ప్రదేశం ముళ్ల చెట్లతో నిండిపోయి చిట్టడవిని తలపిస్తోంది. అక్కడే తినాలి.. అక్కడే పడుకోవాలి. చిన్న లాంతరు పెట్టుకుని రాత్రిళ్లు నిద్రిస్తున్నారు. విషపురుగులు, క్రూర జంతువులతో ప్రాణాలకు హాని ఉన్నా మరోదారి లేక అక్కడే బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. సొంత గ్రామంలో చేయడానికి పనులు లేక కుటుంబంలోని మొత్తం సభ్యులు ఇక్కడికి వలస వచ్చి బొగ్గులు కాల్చే పనులు చేస్తున్నారు. వీరంతా బొగ్గులు కాల్చి ముంబై హైదరాబాద్ బెంగళూర్ వంటి నగరాలకు సరఫరా చేసే నితిందేవ్కేట్ అనే వ్యాపారి వద్ద పనిచేస్తున్నారు. ఈ వ్యాపారి బొగ్గులు కాల్చే ఒక్కొక్కరికి ఏడాదికి రూ.1లక్ష చొప్పున ఇచ్చి పని చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. బొగ్గులు కాల్చే కార్మికులు జీవనానికి బియ్యం, కూరగాయలు, ఇతర సరుకులకు డబ్బులు ముందస్తుగా ఇస్తే కార్మికులకు ఇచ్చే రూ.లక్షలో పట్టుకుని ఇస్తారు. కార్మికులకు కనీసం తాగడానికి నీళ్లు కూడా ఉండడం లేదు. నీరు కావాలంటే వారున్న ప్రాంతం నుంచి రెండు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకోవాలి. స్నానాలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు నీటి కోసం హంద్రీనీవా కాలవ నుండి లీకైన నీరు కురుసాంద్ర చెరువుకు వెళ్లే కాలువలో తెచ్చుకుంటున్నారు. అక్కడే తింటున్నారు.. అక్కడే నిద్రిస్తున్నారు. నిత్యం బొగ్గు బట్టీలకు సమీపంలో ఉండడంతో విష వాయువులు పీల్చి కార్మికులు, వారి పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.



బొగ్గులు కాల్చే ప్రదేశంలో కార్మికుల పిల్లలు

చదువులకు పిల్లలు దూరం

ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం బొగ్గుల బట్టీల్లో బుగ్గిపాలవుతోంది. తల్లిదండ్రులు వలస వస్తున్న సందర్భంలో పిల్లలను వారి వెంట తెచ్చుకుంటున్నారు. దీంతో పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. తల్లిదండ్రులు ఎక్కడికి వెళ్తే అక్కడికి వారి పిల్లల్ని తీసుకెళ్తున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన వయసులో ఇలా వలస వెళ్లిన పిల్లల బంగారు భవిష్యత్తు నాశనం అవుతోంది.

పాత సిమెంట్ సంచులే నివాసాలు

బొగ్గులు కాల్చే ప్రాంతంలో కార్మికులకు వసతి ఏర్పాటు చేయడంపై వారిని తీసుకొచ్చిన వ్యాపారి దృష్టి సారించలేదు. కార్మికులు పాత సిమెంట్ సంచుల బట్టలను కుట్టుకుని చిన్న కర్రలను గుడిసెలా ఏర్పాటు చేసుకుని అందులో ఉంటున్నారు. ఎండా వాన గాలికి తట్టుకుని ఆ చిన్న గుడిసెలోనే తలదాచుకుంటున్నారు. మహిళలు స్నానం చేయాలన్న బహిర్భూమికి వెళ్లాలన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికులు 15 రోజులకు ఒకసారి స్నానం చేయడంతో చర్మవ్యాధులు ప్రబలి అనారోగ్యం పాలవుతున్నారు.

ఉపాధి లేక వలసొచ్చాం



సొంత గ్రామంలో ఉపాధి అవకాశాలు లేక ఇలా బొగ్గు కాల్చేందుకు వచ్చాం. పిల్లలను అక్కడ వదిలిరావడానికి వారి వద్ద ఎవరూ ఉండరు. అందుకే మాతో పాటు పిల్లల్ని తీసుకుని వచ్చాం. ఏడాది పొడవునా బొగ్గుకాల్చే పనులు చేస్తే లక్ష రూపాయలు ఇస్తారు. అందులో మా జీవనానికి తీసుకున్న మొత్తాన్ని తొలగించి చివరన మిగిలింది వ్యాపారి మాకు ఇస్తారు. పనిచేసే ప్రాంతంలో పాములు విషపురుగులు ఉంటాయి. తాగడానికి నీటి వసతిఉండదు.

విలాస్, కార్మికుడు.

వలస కార్మికులకు భద్రత కల్పించాలి

మహారాష్ట్ర నుంచి వలస వచ్చి బొగ్గు కాలుస్తున్న వలస కార్మికులకు భద్రత కల్పించాలి. బొగ్గుల వ్యాపారి కార్మికుల కష్టాలను దోచుకుని లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. కార్మికులకు వసతి సౌకర్యాలను కల్పించడం లేదు. తాగడానికి నీరు కూడా లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. అటవీ శాఖ అధికారులు బొగ్గుబట్టి యజమానులకు అనుమతులు ఇచ్చే సమయంలో కార్మికులకు కల్పించాల్సిన భద్రతా ప్రమాణాలను పరిశీలించి ఇవ్వాలి. వలస వచ్చిన కార్మికుల పిల్లలకు స్థానిక పాఠశాలల్లో చదువులు చెప్పే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

హరి, సిపిఎం నాయకులు.

ఏకత్వాన్ని దెబ్బతీసేలా బిజెపి కుట్ర

- రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నాలు
- లౌకికవాదంతో సమాజం అభివృద్ధి
- హైకోర్టు రిటైర్డు జడ్జీ కె.చంద్రు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాజ్యాంగ స్ఫూర్తికి మూలమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసేందుకు బిజెపి దాని అనుబంధ సంస్థలైన ఆర్ఎస్‌లు కుట్ర చేస్తున్నాయని హైకోర్టు రిటైర్డ్ జడ్జి కె.చంద్రు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో 'ఇన్ డిఫెన్స్ ఆఫ్ ఇండియన్ కాన్స్టిట్యూషను' అన్న అంశంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ), జన విజ్ఞాన వేదిక (జెవివి) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నాడు సదస్సు జరిగింది. అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో జస్టిస్ చంద్రు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, దాని అనుబంధ సంఘమైన ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని మార్చేందుకు అడుగడుగునా కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహాత్మాగాంధీ పేరును ఉపాధి హామీ పథకానికి పెట్టగా బిజెపి పాలనలో గాంధీ పేరు కన్పించకూడదన్న ఉద్దేశంతో ఆ పథకం పేరును పూజ్య బాపుజీగా మార్చడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. గాంధీ పేరును ప్రజల నుంచి దూరం చేయడంలో భాగంగానే పేరును మార్చారన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో కీలకంగా వ్యవహరించాల్సిన న్యాయ వ్యవస్థ కూడా కొన్ని చోట్ల పాలకులకు అనుకూలంగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. పాలస్తీనకు మద్దతుగా ముంబయి సిపిఎం ఒక సభను నిర్వహించాలని చూస్తే అక్కడి పోలీసు అధికారులు అనుమతినివ్వలేదని చెప్పారు. దీనిపై న్యాయస్థానానికెళితే ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలపై ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదని ఉత్తర్వులివ్వడం విస్మయం కలిగిస్తోందన్నారు. కర్నాటకలో హిజాబ్ విషయంలోనూ ఇదే స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే రాజ్యాంగ పరిషత్‌లో అత్యధికులు హిందువూలే ఉన్నప్పటికీ భారత దేశం లౌకికంగా ఉండాలని నిర్ణయించారని గుర్తుచేశారు. అందుకు అనుగుణంగానే రాజ్యాంగ నిర్మాణం జరిగిందన్నారు. మరోవైపు ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని పాలకులు చూస్తున్నారన్నారు. జెఎన్‌యు విద్యార్థి ఉమర్ ఖాలీద్‌ను ఐదేళ్లుగా జైల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అతనిపై నమోదు చేసిన కేసులో ఇప్పటి వరకు ఎటువంటి అభియోగాలనూ పోలీసులు రుజువు చేయలేకపోయారన్నారు. రేబోయే రోజుల్లో దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత అందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఐలూ జాతీయ కార్యదర్శి నర్ర శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటస్వామి, నాయకులు నరసింహ, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, ప్రముఖ వైద్యులు వంశీకృష్ణ , జెవివి జిల్లా కార్యదర్శి వీరరాజు, ఐలూ నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌తో కార్మికులకు నష్టం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-రొళ్ల

కార్మికుల నష్టదాయకంగా ఉన్న లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుళు డిమాండ్ చేశారు. రొళ్ల మండల పరిధిలోని యానిమేటర్ల సమావేశం ఆదివారం కొత్తపాలెం గ్రామంలోని శ్రీవెంకటేశ్వర దేవాలయంలో జరిగింది. శివరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు జిల్లా అధ్యక్షులు జెడ్పీ.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కుల హరించేలా పాలన సాగిస్తోందన్నారు. విఒలతో వివోయేతర పనులు చేయించకూడదన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్, జీతం పెంపుదల, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు అఖిల భారత సిఐటియు 18వ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఇందులో కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలపునిచ్చారు. సోమవారం నాడు పుట్టపర్తి కార్మిక, కర్షక భవన్లో జరిగే జిల్లా వీవోఏల సంఘాల సమావేశంలో సత్యసాయి జిల్లా వీవోఏలందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో విఒఎల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు డిహెచ్.రాయుడు, ఐదు మండలాల వివోఏ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, విఒఎలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా వైద్యాధికారి ఫిరోజ్ బేగం



ఫిరోజ్ బేగం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

'కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రస్తుత శీతాకాలంలో వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫిరోజ్ బేగం తెలియజేశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన పలు విషయాలను ప్రజాశక్తితో ఆమె ముచ్చటించారు.

ప్ర: సత్యసాయి జయంతోత్సవాల్లో వైద్య ఆరోగ్యశాఖ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు.? ఎన్ని మెడికల్ క్యాంపులు నిర్వహించారు.?

డిఎంహెచ్ఒ : సత్య సాయి జయంతోత్సవాలలో పుట్టపర్తిలో 23 మెడికల్ క్యాంపులు నిర్వహించాం. పది రోజులు పాటు వీటిని కొనసాగించాం. భక్తులు బస, పార్కింగ్ చేసిన ప్రదేశాల్లో కలిపి పట్టణం, ప్రశాంతి నిలయంలో 12 చోట్ల మెడికల్ క్యాంపులు, ఏర్పాటుచేసి వేలాదిమందికి వైద్య సేవలు అందించాం. అంతేకాక వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశాల మేరకు హిల్‌వ్యూ స్టేడియంలో ప్రధానమంత్రి బహిరంగ సమావేశ సందర్భంగా స్టేడియంలో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం. ప్రధానమంత్రి, రాష్ట్రపతి, గవర్నర్, ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వెంట ప్రోటోకాల్ ప్రకారం అంబులెన్స్‌లు ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యం ఎక్కడ ఇలాంటి అసౌకర్యం కలగకుండా పట్టణంలో సత్యమ్మ గుడి, చిత్రావతి రోడ్డు, యనమలపల్లి, గణేష్ కూడలి, ఆర్డీవో కార్యాలయం ఆర్టీసీ బస్టాండ్, ప్రశాంతి నిలయం తదితర ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం.

ప్ర: సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డిఎంహెచ్ఒ: సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. ఇటీవల జిల్లా వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్‌కు సంబంధించి 199 మందిని అనుమానితులుగా గుర్తించాం. రక్తపరీక్షలు చేయగా ఇందులో 9మందికి పాజిటివ్ వచ్చింది. వీరిలో ఆరుగురు ఇప్పటికే పూర్తిగా కోలుకున్నారు. ముగ్గురు మాత్రమే ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. స్క్రబ్ టైఫస్ వల్ల ఎలాంటి ప్రాణహానీ లేదు. ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మలేరియా, డెంగీ, పిల్లలకు మధుమేహం, వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. 104 సిబ్బంది ద్వారా గ్రామాల్లో బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి పరీక్షలను చేయిస్తున్నాం. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్ర: జిల్లాలో లెప్రసీ కేసులు ఎన్ని ఉన్నాయి.?

డిఎంహెచ్ఒ : జిల్లాలో లెప్రసీ కేసులు గుర్తించడానికి జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వే నిర్వహించాం. స్పర్శ లేని మచ్చలు కలిగిన వ్యక్తులను గుర్తించి వ్యాధి నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వం నుండి ఉచితంగా మందులను అందజేస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సర్వేలు నిర్వహించి జిల్లావ్యాప్తంగా 3621 కేసులు గుర్తించగా, వాటిలో 1341 కేసులను పరీక్షించాం. అందులో ఐదు కేసులు మాత్రం నిర్ధారణయ్యాయి. గతంలో గుర్తించిన కేసులను సైతం పరిశీలించి పరీక్షించారు.



ప్ర: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో లేరనే ఆరోపణలపై మీ అభిప్రాయం ఏమిటి.?

డిఎంహెచ్ఒ : జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆసుపత్రుల్లో 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉంటారు. వారు షిఫ్టుల ప్రకారం వచ్చి వెళుతూ ఉంటారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. డాక్టర్లు అందుబాటులో లేరనే మాట అవాస్తవం. జిల్లా అధికారులు తరచూ ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపెయిన్ల ద్వారా విజిట్లు నిర్వహిస్తున్నాం. విధులకు హాజరు కాని వారిని తమ దృష్టికి వస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్ర: జిల్లా వ్యాప్తంగా సిబ్బంది, మందుల కొరత ఉందా.?

డిఎంహెచ్ఒ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఎలాంటి మందుల కొరతా లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 47 ఉండగా వాటిలో 26 మంది స్టాఫ్ నర్సులు, కొరత ఉంది. రామగిరిలో డాక్టర్ లేరు. వాటిని భర్తీ చేయడానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

ప్ర: జిల్లా వ్యాప్తంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరులో అక్రమాలు జరుగుతున్నా మాట వాస్తవమేనా.?

డిఎంహెచ్ఒ : జిల్లాలోని అమరాపురం మండలం కొమిరేపల్లి గ్రామంలో 10 నెలల్లోనే 4వేలకుపైగా జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరుపై సమగ్ర విచారణ చేపట్టాం. నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై పోలీస్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 12 వేలు నమోదు అయితే కొమిరేపల్లిలో మాత్రం 3982 ఒక గ్రామ పంచాయతీలోనే అత్యధికంగా నమోదు కావడంపై విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేశాం.

ప్రభుత్వ కళాశాలల్లోనూ ఫిజియోథెరపీ కోర్సులు

ప్రజాశక్తి-అనంతపురం

ఈ ఏడాది నుంచి ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలల్లోనూ ఫిజియోథెరపీ కోర్సులు ప్రారంభించ నున్నట్లు డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో ఆదివారం 20వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి చంద్రశేఖర్ ఫిజియోథెరపీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసం గించారు. ఫిజియోథెరపీతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రోగం నయం చేయడంలో ఫిజియో థెరపీల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఫిజియోథెరపీ వల్ల కొన్ని జబ్బుల్లో వ్యాధిగ్రస్తులకు అత్యంత వేగవంతంగా ఉపశమనం కలిగి ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే బిపిటిలో యూనివర్సిటీలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని వరలక్ష్మితో పాటు ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా ప్రశంసా పత్రం మెడల్స్‌తో అభినందించారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ పరేడ్ నిర్వహించిన వాలంటీర్లు, వివిధ పోటీల విజేత విద్యార్థులను ప్రశంసా పత్రం, మెడల్స్‌తో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెడిక్ట, న్యూరో సర్జరీ ప్రధాన విభాగాధిపతి డా.భాస్కర్, కస్తూరి ఫిజియోథెరఫీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రహ్లాద, సెక్రటరీ డా. సుదర్శన్, కరస్పాండెంట్ చంద్రశేఖర్, వైద్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ చైతన్య, డాక్టర్ ఆదిరెడ్డి వరదేశినాయుడు, విఠల్‌శెట్టి, అధ్యాపకులు, శ్రీశ్రీనివాస నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

'మిసెస్ ఆంధ్ర' పోటీల్లో ఫస్ట్ రన్నరప్‌గా మడకశిర వాసి

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిరకు చెందిన ఓ మహిళ 'మిసెస్ ఆంధ్ర' పోటీల్లో ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది. విజయవాడలో జరిగిన ప్రతిష్టాత్మక 'శ్రీమతి ఆంధ్రప్రదేశ్ – 2025' పోటీలలో మడకశిరకు చెందిన సోను సౌందర్య 'ఫస్ట్ రన్నరప్'గా నిలిచింది. గత అక్టోబర్ నెలలో 'శ్రీమతి విజయవాడ' కిరీటాన్ని దక్కించుకున్న సోను సౌందర్య, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ తన సత్తా చాటింది. సోను సౌందర్య కేవలం అందాల పోటీల్లోనే కాకుండా వృత్తిపరంగానూ ఆమె రాణిస్తున్నారు. హిందూపురంలో 'గ్లాం స్టూడియో హౌస్ ఆఫ్ బ్యూటీ' నిర్వహిస్తూ మేకప్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె సాధించిన ఈ వరుస విజయాలు ఎంతో మంది గృహిణులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సోను సౌందర్య తమ ప్రాంతానికి ఇంతటి గుర్తింపు తెచ్చినందుకు మడకశిర పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



మిసెస్ ఆంధ్ర రన్నరప్ కిరీటంతో సోను సౌందర్య

దీపిక కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి మడకశిర టౌన్

అంధుల క్రికెట్ కెప్టెన్ దీపికకు జనసేన నాయకులు చేయూతను అందజేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అహుడా ఛైర్మన్ టిసి. వరుణ్ దీపిక కుటుంబసభ్యులకు నిత్యావసర వస్తువులతో పాటు ఇంటికి అవసరమైన గృహోపకరాలను ఆదివారం అందజేశారు. ఈ మేరకు టిసి వరుణ్ ఆదివారం అమరాపురం మండలం తంబళ్ల హట్టి గ్రామానికి వచ్చి దీపిక తల్లిదండ్రులకు టీవీ ,ఫ్యాన్, కుక్కర్, మిక్సీ , కుర్చీలు, సోఫా తదితర వాటితో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు.



దీపిక కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న టిసి. వరుణ్

బసవ పున్నయ్య జయంతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం మండల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య 111వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ మాకినేని బసవ పున్నయ్య చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, వెంకటేశులు, కొండా వెంకటేశులు , చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి జింకా నాగరాజు, సుధాకర్, సంజీవ, గోవిందప్ప, కేతగాని చెరువు రామాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఊటుకూరు కిష్ట , ఐద్వా మండల నాయకులు హనుమక్క , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



బసవ పున్నయ్య చిత్రపటానికి నాయకుల నివాళి

జీవనోపాధుల పెంపుదలపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కోగిర ప్రాంతంలోని కల్పవల్లి అటవీ సంరక్షణ ప్రాంతంలో టింబక్టు బుష్ క్యాంపులో యువతకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలోని యువతకు టింబక్టు కలెక్టివ్ సంస్థ లోని కల్పవల్లి సొసైటీ సిఇఒ చిరంజీవి గ్రామీణ ప్రాంతంలోని యువత సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సంబంధిత జీవనోపాదుల గురించి, ప్రస్తుత పరిస్థితుల్లో పాముకాటు నిర్వహణ చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. గ్రామీణ ప్రాంతంలోని యువతతో మమేకమై పర్యావరణం లో యువత పాత్ర గురించి అభిప్రాయాలు అడిగి తీసుకున్నారు. ఇందులో మూడు మండలాల నుండి 80 మంది యువత కల్పవల్లి కార్యకర్తలు యు రవి ఎన్. ముఖేష్ యు. సతీష్ బి. ఆదినారాయణ బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా ప్రభుత్వ డైరీ మూత



మూత పడిన పాల శీతలీకరణ కేంద్రం

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంత జిల్లాలో వ్యవసాయం సంక్షోభంలో ఉండటంతో అదనపు ఆదాయం కోసం రైతులు పాడిపరిశ్రమపై ఆధారపడుతున్నారు. కరువు జిల్లాను ఆదుకోవాలని 1978లో హిందూపురం పట్టణంలో సిపిఐ కాలనీ సమీపంలో దాదాపు ఎకరాల స్థలంలో ప్రభుత్వ పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రపంచ బ్యాంకు సహకారంతో ప్రారంభించారు. జిల్లాలో ఒక్క హిందూపురం పాల డైరీలోనే ప్రతిరోజు దాదాపు లక్ష లీటర్లకుపైగా పాల సేకరణ జరిగేది. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం డైరీ కాస్తా కనుమరుగైంది. టిడిపి ప్రభుత్వం పాల ఉత్పత్తి దారులకు పాల ధరలను తగ్గించి, వారికి బకాయిలు పెట్టి పాలకుల సొంత డైరీ హెరిటేజ్‌కు పాలను సేకరిస్తోందన్న ఆరోపణలున్నాయి. రైతు ప్రభుత్వం అని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అమూల్ డైరీ కోసం పూర్తిగా ప్రభుత్వ డైరీలను నిలిపి వేసింది. దీంతో గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వ డైరీ మూత పడింది. కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి డైరీని ప్రారంభిస్తే పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వేరుశెనగ పంట తర్వాత ఎక్కువ మంది సిల్క్, మిల్క్ పై ఆధారపడి జీవనం చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా వర్షాభావ పరిస్థితులు సరిగా

పాలకుల నిర్లక్ష్యం
ప్రయివేటును ఆశ్రయిస్తున్న పాడి రైతులు

లేక పోవడంతో ఎక్కువ మంది రైతులు సిల్క్, మిల్క్‌పై ఆధారపడ్డారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాలశీతలీకరణ కేంద్రం ప్రాంగణంలో ఉన్న భవనాలు నిరూపంగా మారిపోయాయి. 1978లో ప్రారంభమైన ఈ కేంద్రం విజయవాడలోని విజయ పాల సంస్థ ఆధీనంలో ఉండేది. 42 సంవత్సరాలుగా వేలాది మంది రైతులకు ఆవులు, గేదెల పెంపకం దారులకు వరంగా ఉండేది. మడకశిర, పెనుగొండ, కదిరి, హిందూపురం నియోజకవర్గాల నుంచి 957 గ్రామాల నుంచి సేకరించిన పాలను అక్కడే మిల్క్ డైరీలో చల్లదనం చేసిన తర్వాత ఇక్కడకు వచ్చేవి. యంత్రాలు, పరికరాలతో పాలను వేడి చేయడం, ఆ తర్వాత చల్లదనం చేయడమని ప్రక్రియ హిందూపురంలో జరిగేది. రోజుకు 80 నుంచి 90వేల లీటర్ల దాకా పాలు పాలశీతలీకరణ కేంద్రానికి వచ్చేవి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల కుటుంబాలకు జీవనాధారంగా ఉండేది. వివిధ గ్రామాల నుంచి తెచ్చిన పాలను రవాణా చేసే వాహనాల రాకపోకలు, వచ్చిపోయే రైతులతో రద్దీగా ఉండేది. ఇక్కడ ఉన్న భవనాలకు భద్రత ఉండేది. 2014-2019 మధ్య కాలంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం హెరిటేజ్ కోసం పాల ఉత్పత్తి దారులకు పాల ధరలను తగ్గించి, బకాయిలు పెట్టి వారి సొంత డైరీ హెరిటేజ్ కు పాలను సేకరించినట్లు ఆరోపణలున్నాయి. దీంతో పాటు 2020లో వచ్చిన కరోనా ప్రభావంతో డైరీ నిర్వహణ ఆగిపోయింది. 2019 ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం విజయ డైరీని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉన్నప్పటికి ఆయన ఏ మాత్రం పట్టించు కోలేదన్న విమర్శలున్నాయి. అప్పటి వైసిపి ప్రభుత్వం విజయ డైరీని అమూల్ పాల సంస్థకు అప్పగించాలని సిద్ధమైంది. ఇదే విధంగానే రాష్ట్రంలో పలు జిల్లాల్లో విజయ డైరీని అమూల్ సంస్థకు అప్పగించారు. అయితే హిందూపురంలో ఉన్న డైరీని అప్పగించలేదు. దీంతో పాలశీతలీకరణ కేంద్రం ఆరేళ్లుగా మూతపడింది. దీంతో అక్కడ ఉన్న భవనాల చుట్టూ కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పోయాయి. పాలను వేరు చేసే ప్రక్రియకు సంబంధించిన పరికరాలు, యంత్రాలు ఆరుబయటే ఉన్నాయి. భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలు లోపలికి ప్రవేశించి వీటిని ధ్వంసం చేస్తున్నారు. మూడు ఎకరాల్లో ఉన్న డైరీ భవనాలు మినహాయించి ఏడు ఎకరాల స్థలం నిర్వీర్యంగా ఉంది.

ప్రభుత్వ సంస్థలపై నిర్లక్ష్యం...ప్రయివేటు సంస్థలకు ప్రోత్సాహకం

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన బడా పారిశ్రామిక వేత్తలకు ఒక రూపాయికి ఎకర భూమి ఇవ్వడంతో పాటు వారికి కోట్లాది రూపాయిలు ప్రోత్సహకంగా ఇచ్చి ఆదుకొంటారు. అయితే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను మాత్రం ఎవరు పట్టించు కోవడం లేదు. దీనికి నిదర్శనం హిందూపురం పట్టణంలో ఉన్న పాలశీతలీకరణ కేంద్రమే నిదర్శనం. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల విజయ డైరీ కాస్తా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కనుమరుగైంది. ప్రభుత్వం సేకరించిన పాలను మార్కెటింగ్ ద్వారా విక్రయిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి వేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే నేడు పాడిపరిశ్రమ అంతరించే ప్రమాదం ఏర్పడింది. ప్రధానంగా ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా వ్యవసాయంగా తీసుకుంటే వేరుశనగ తర్వాత మల్బరిసాగు వీటితో పాటు పాడిపరిశ్రమ ప్రధానమైనది. ప్రస్తుతం వర్షాలు సరిగా లేకపోవడం హంద్రినీవా త్వరితగతిన పూర్తి కాకపోవడం తదితర కారణాలతో అనంత రైతులు పూర్తిగా పాడిపరిశ్రమపైనే ఆధారపడి ఉన్నారు. ప్రభుత్వం చొరవతీసుకొని పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే రాయితీల్లో కాస్తా విజయ డైరీకి ఇచ్చి ఆదుకొంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా



శిథిలమైపోతున్న సిబ్బంది క్వాట్రస్

పాడిపరిశ్రమకు పూర్వ వైభవం వచ్చే అవకాశాలున్నాయి.

మార్కెటింగ్ అభివృద్ధి చేస్తే అధిక లాభాలు

హిందూపురం నియోజకవర్గంతో పాటు పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు ప్రతిరోజు 80వేల లీటర్లకుపైగా పాలను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఈ ప్రాంతాలలో ఉన్న ఎపి డెయిరీ నుండి 60 నుంచి 80 వేల లీటర్ల వరకు పాల సేకరణ జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల పాడి రైతులకు అవగాహన కల్పించి, పూర్తి స్థాయిలో పాల సేకరణ చేసి, మార్కెటింగ్ చేస్తే ఇక్కడ లభ్యమయ్యే పాలు నేరుగా ఈ ప్రాంతంలోనే విక్రయించవచ్చు. పాడి పరిశ్రమశాఖకు రవాణా ఖర్చులు సైతం మిగులుతాయి. దీంతో పాటు అంగన్ వాడి కేంద్రాలకు సైతం పాలను సరఫరా చేస్తే మరింత లాభలు వచ్చే అవకాశాలున్నాయి. ఎపి డెయిరీ ఇలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతాల్లో ప్రయివేటు డైరీలు ఇష్టారాజయగా పాలను విక్రయిస్తున్నాయి.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం

హిందూపురం పట్టణంలో ఉన్న పాలశీతలీకరణ కేంద్రాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం. గత నెల మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ పరిశీలించి వివరాలు తెలుసుకొని వెళ్లారు. భద్రత కోసం ప్రహరీ నిర్మించడం, కాపలాదారుడిని నియమించేలా చర్యలు తీసుకుంటాం.

నారాయణమ్మ,
మేనేజర్ పాలశీతలీకరణ కేంద్రం

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ మరమ్మతు పనులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో మైనార్టీ ఫంక్షన్ హాల్ శిథిలమైనా పట్టించుకోలేదన్నారు. టిడిపి పాలనలోనే మైనార్టీ ఫంక్షన్ హాల్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరమ్మతు పనులు త్వరలోనే పూర్తి చేసి మైనార్టీ సోదరులకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాల్మీకి అనిల్ కుమార్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి - గాండ్లపెంట

పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉంచుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇంగ్లీష్ భౌతిక రసాయన శాస్త్ర సబ్జెక్టు ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ రాజారత్నం తెలిపారు మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టులపై ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా విద్య బోధనలు అందిస్తున్నామని వారు తెలిపారు.

పేదల కంటి వెలుగుకు రోటరీ క్లబ్ కృషి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే తమ ప్రధాన లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభూషణ పేర్కొన్నారు, ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరం రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు, సత్యసాయి జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరానికి దాతగా దివంగత కోరా రామ సుబ్బారెడ్డి తమ్ముడు కోరా రామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారన్నారు. శిబిరంలో 110 మందికి శంకర కంటి ఆసుపత్రి కంటి డాక్టర్ అబీద్ వైద్య చికిత్సలు అందించి అందులో 75 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి నరేందర్ రెడ్డి, క్యాంపు చైర్మన్ దాసు, సాంస్కృతిక మండలి అధ్యక్షులు సత్రశాల ప్రసన్నకుమార్, రమేష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, జయసింహ, శివయ్య, సుదర్శన్ గుప్తా తో పాటు శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - అమడగూరు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పుట్టపర్తి మాజీ శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ జయప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు కట్టేందుకు మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందన్నారు. దాంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు వైద్యానికి దూరమవుతారన్నారు. నిరుపేదలకు వైద్యం అందించాలని ఉద్దేశంతోగత ప్రభుత్వం మెడికల్ కాలేజీలను కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అన్ని హంగులతో నిర్మాణాలు చేపడితే వాటిని ప్రారంభించి , పేదలకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వం ఏకంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి దారుణమన్నారు. సత్యసాయి జిల్లాలో సంతకాలు సేకరించిన ప్రతులతో పుట్టపర్తి లోని గణేష్ సర్కిల్ నుంచి, సూపర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, ప్రజా సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కందికి రూ. 8వేలు మద్దతు ధర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో కంది పండించిన రైతులకు కనీస మద్దతు ధర రూ. 8వేలతో విక్రయించుకోవటానికి ఆయా మండలాల్లోరని ఆర్ఎస్‌కెల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎపి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో కంది పంట పండించిన ప్రతి రైతు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

మెడికల్ క్యాంప్ నిర్వహణకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో ఈనెల 27.28.వ తేదీలలో ఏపీ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మెడికల్ క్యాంప్ నిర్వహణకు అనుకూలమైన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెప్మా అధ్యక్షులు హాజీ ఖాదర్ బాషా, ఏపీ మెప్మా డాక్టర్ల బృందం హుస్సేన్, అష్రఫ్ అలీ, బాబా ఫక్రుద్దీన్, నూర్‌తో పాటుకమిటీ సభ్యులు చాంద్ భాషా. అమిరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ పరిధిలోని మోత్కుపల్లిలో ఆదివారం భక్త కనకదాసు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నియోజక వర్గ సమన్వయ కర్త దీపికా వేణురెడ్డితో పాటు వైసిపి నాయకులు, ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎ బాలాజీ, రోడ్లు, అభివృద్ధికార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్‌తో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు, ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్‌తో ఆయా పార్టీల నాయకులు, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయస్థాయిలో తమ సత్తా చాటి ఉత్తమ ప్రతిభ కనపరచాలని సత్య సాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు కోరారు. జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎన్నికైన క్రీడాకారుడు నవదీప్, వాలీబాల్ సౌత్ జోన్ క్రీడాకారుడు మురళిని ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు, జాతీయస్థాయిలో రాణించి, తమ సత్తా చాటాలని తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తూ వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ ఎర్ర కేశప్ప, పిడి రామకృష్ణ, ఉపాధ్యాయులు తిప్పన్న, రవిచంద్ర, నాయకులు సమకోటి ఈశ్వరయ్య, మంజునాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



కీడాకారులను సన్మానిస్తున్న సామకోటి



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

అమరాపురం చెరువుకు కృష్ణాజలాలు

ప్రజాశక్తి - అమరాపురం

మడకశిర నియోజకవర్గం పరిధిలోని కర్నాటక సరిహద్దులో ఉన్న అమరాపురం చెరువును కృష్ణాజలాలతో నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. అమరాపురం చెరువులో కంప చెట్లను తొలగిస్తున్న పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతు చిట్టచివరి ఉన్న అమరాపురం చెరువుకు కృష్ణా జలాలు నింపే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అమరాపురం మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లోని బాధితులను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన గౌస్ పీర, చాకల మహేష్ కుటుంబాలకు పరామర్శించారు. అనంతరం మోకాళ్ళ శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రోషన్‌ను పరామర్శించారు. పెడపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రంగప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మండల పరిధిలోని కోట్లపల్లి ఎస్సీ కాలనీలో వెట్టి కిష్టప్ప అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన శివ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని పరామర్శించారు. శంకరప్ప కుమారుడు నరసింహమూర్తి బైక్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇంటి దగ్గరికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిడిమామిడి పంచాయతీ పరిధిలోని కత్తి వారి పల్లి గ్రామానికి చెందిన బాబయ్య ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. దండువారి పల్లి గ్రామానికి చెందిన రాజారెడ్డి, దండువారిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి చెన్నయ్య కుమార్తె శ్వేత మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏవి రమణారెడ్డి, పెడపల్లి సర్పంచి మంగ్లీబాయి, తిరుపాల్ నాయక్, గంగాధర్, వైసిపి మండల కన్వీనర్ రవి నాయక్, మాబు సాబ్, కేశప్ప, రామచంద్ర రెడ్డి, వైసిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు యానిమేటర్ల సమస్యలపై చర్చ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలోని యానిమేటర్స్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించడానికి పుట్టపర్తి లోని కార్మిక కర్షక భవన్ లో సోమవారం సమావేశం నిర్వహించనున్నామని సిపిఎం నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, వివోఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి హాజరవుతారని చెప్పారు. కావున జిల్లాలోని వివోఏ (యానిమేటర్స్) హాజరు కావాలని సత్యసాయి జిల్లా వివోఏ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జివిఎల్ నరసింహులు కోరారు.

విద్యార్థులను సినిమాకు తీసుకెళ్లిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ ఎం జె పి పాఠశాల, కళాశాల విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు సినిమాకు తీసుకెళ్లారు. గతంలో పాఠశాల తనిఖీకి వెళ్లిన ఎమ్మెల్యేకు విద్యార్థులు ఒక అభ్యర్థన చేశారు. సెలవు రోజున తమను బయటకు తీసుకువెళ్లాలని కోరారు. విద్యార్థుల కోరిక మేరకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆదివారం గుడిబండ హనుమాన్ థియేటర్ యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులు వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించి థియేటర్‌లో సినిమా చూపించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

పంటలకు వన్యప్రాణుల బెడద



బీడుగా మారిన భూములు

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండలంలోని పలు గ్రామాలకు వన్యప్రాణుల బెడద ఎక్కువైంది. వీటి బెడదతో రైతులు పంటసాగుకు కూడా జంకుతున్నారు. ప్రధానంగా వేరుశనగ పంట సాగు చేయడానికి సుముఖత చూపడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో వేరుశనగ సాగు కనుమరుగవుతోంది. మండలంలోని హరే సముద్రం, బుల్లసముద్రం, మనురు, వైబిహళ్లి, గోవిందాపురం, గంగలవాయి, గుండుమల, కదిరేపల్లి, ఆమిదాల గొంది, కాపురామగిరి, బోయ రామగిరి తదితర ప్రాంత రైతులు ప్రధాన పంటగా వేరుశనగను సాగు చేసేవారు సమయానికి వర్షాలు కురవకపోయినా తెగుల బారి నుండి పంటకు నష్టం వచ్చిన రైతులు ఈ పంటపై నమ్మకం ఉంచి సాగు చేస్తూ వస్తూ ఉన్నారు. ఒక సంవత్సరం పంట బాగా పండితే నష్టాన్ని అధిగమించవచ్చని రైతులు నమ్మకంతో వేరుశనగ పంటను సాగు చేసేవారు. కానీ వన్యప్రాణుల బెడద అధికం కావడంతో రైతులు వందలాది ఎకరాల సాగు భూమిని బీడు భూమిగా మార్చుతున్నారు. రైతులు వ్యవసాయం చేయడానికి ప్రయత్నించినా జింకలు, కోతులు, నెమళ్లు, ఎలుగుబంట్లు, అడవి పందులు తదితర వన్యప్రాణుల బెడద అధికం కావడంతో పంట ఏమాత్రం చేతికి అందకపోవడంతో రైతులు వందలాది ఎకరాలను వ్యవసాయం చేయకుండా వదిలేశారు. కొంతమంది రైతులు భూమి ఎక్కువ ఉన్న వన్యప్రాణుల నుండి కాపాడుకోవడానికి కాకపోవడంతో కొద్దిపాటి భూమికి కంచెను ఏర్పాటు చేసుకొని వాణిజ్య పంటలను పండిస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. బోరు బావులు. కరెంటు అధునాతనమైన పండించే భూమి అన్ని ఉన్నా కూడా వన్యప్రాణుల నుండి కాపాడుకోలేక రైతులు వ్యవసాయం వదిలేశారు ప్రభుత్వం స్పందించి వన్యప్రాణుల నుండి రైతులు పంటను కాపాడుకోవడానికి వందశాతం బ్సిడీతో కంచెను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తే నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ భూమి ఉపయోగకరంగా మారి రైతులకు జీవనోపాధి కలుగుతుందని స్థానిక రైతులు అభిప్రాయపడుతున్నారు.

అసభ్యకర పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై సోషల్ మీడియాలో అసభ్యకరంగా, అసంబద్ధంగా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ గ్రామీణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నాగేందర్‌కు ఫిర్యాదు చేశారు. గాండ్లపెంట మండలం చామాలగొందికి చెందిన హరి నాయుడు, మరి కొంతమంది సోషల్ మీడియా వేదికగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై అసభ్యకర పోస్టులు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఫిర్యాదులో తెలిపారు. సంబంధిత వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి దుష్ప్రచారాలకు అవకాశం లేకుండా కఠినంగా శిక్షించాలని జనసేన నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కాయల చలపతి , రాజేంద్రప్రసాద్ చెక్కా రమణ, సాకే రవికుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరంరూరల్ తుంపర్తి కాలనీకి చెందిన మల్లేశ్వరమ్మ(45) అనే మహిళ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. మల్లేశ్వరమ్మ తన కుమారుడు శివతో కలసి ద్విచక్రవాహనంలో తుంపర్తి కాలనీ నుండి ధర్మవరం పట్టణానికి వస్తుండగా తుంపర్తి క్రాస్ సమీపంలో కొత్తచెరువు వైపు నుండి ధర్మవరం వైపు వచ్చే కారు వీరి ద్విచక్రవాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లేశ్వరమ్మ మృతి చెందింది. శివకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు శివని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు మల్లేశ్వరమ్మ భర్త నారాయణస్వామి బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతురాలికి శివతో పాటు మరో కుమారుడు ఉన్నాడు. ఈ ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

హత్యకేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

భూ వివాదం కేసులో ముత్తప్ప అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ హత్యకేసు వివరాలను ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. సెప్టెంబర్ 3న అమడగూరు మండలం ఆకులవారిపల్లి శివారులోని తన పొలంలో టమోట పంట వద్ద ముత్తప్ప ఉండగా కర్నాటక ప్రాంతానికి చెందిన సురేష్, సోమశేఖర్, ఆనంద్ అనే వ్యక్తులు ఇనుప రాడ్లతో దాడి చేసి తలపైన కొట్టి, పొడిచి హత్య చేశారు. ముత్తప్ప భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి తాలూకా చెందిన కే సురేష్, ఆర్ సోమశేఖర్ ,ఆనంద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. దీంతో నిందితులను అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఎస్పీ విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, నల్లమాడ సిఐ నరేందర్ రెడ్డి, డిటిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఒడిసి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ దుకాణంలోకి దూసుకెళ్లిన ప్రయివేటు బస్సు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఆదివారం ఉదయం ఒక పెను ప్రమాదం తృటిలో తప్పింది. వాల్మీకి సర్కిల్ వద్ద అదుపు తప్పిన ఒక ప్రయివేటు బస్సు రోడ్డు పక్కనే ఉన్న సెల్ ఫోన్, సిమ్ కార్డుల దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం, గాయాలు సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తూమకుంట పారిశ్రామిక వాడ నుండి కియా పరిశ్రమకు సుమారు 35 మంది కాంట్రాక్ట్ కార్మికులను తీసుకువెళ్తున్న ప్రయివేటు బస్సు హిందూపురం పట్టణం వాల్మీకి సర్కిల్ వద్ద వేగంగా వెళుతూ అదుపు తప్పింది. వేగంగా వచ్చిన బస్సు నియంత్రణ కోల్పోయి పక్కనే ఉన్న సెల్ ఫోన్ దుకాణంలోకి దూసుకెళ్లి గోడను ఢీకొట్టి ఆగిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది కార్మికులు సురక్షితంగా బయట పడ్డారు. అలాగే దుకాణంలో ఉన్న సిబ్బంది, ఇతర వ్యక్తులకు కూడా ఎటువంటి గాయాలు కాలేదు. అయితే దుకాణంలోని సామగ్రికి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల కేంద్రంలోని ఎం కొత్త పల్లి హైవే క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి తొమ్మిదోతరగతి చదువుతున్న నరసింహ, ఎనిమిదవ తరగతి చదువుతున్న భార్గవ్‌కు . హాస్టల్లో పనిచేస్తున్న గురు ప్రసాద్ అను వ్యక్తికి చెందిన ద్విక్రవాహనాన్ని తీసుకొని అయ్యప్పస్వామి దేవాలయం వద్దకు వెళుతుండగా కదిరి వైపు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్ లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసింహులు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులపై నిర్లక్ష్యం చూపితే చర్యలు :మంత్రి

పుట్టపర్తి రూరల్. సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హాస్టల్ విద్యార్థులు గాయపడిన ఘటనపై మంత్రి సవిత ఆరా తీశారు. గాయపడిన ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపై ఎందుకు వచ్చారని ఆమె ప్రశ్నించినట్లు తెలిసింది. ఇందుకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. వంట పాత్రలిచ్చి ప్రసాదం ఎవరు తీసుకు రమ్మనారో తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. హాస్టల్ లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపైకి ఎందుకొచ్చారని డీఎస్పీడబ్ల్యూవో రెడ్డి బాలాజీని మంత్రి ఫోన్ లో ప్రశ్నించారని సమాచారం. తక్షణమే గాయడిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమందించాలని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ కేసు నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.